


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02 4PM

# డెవిల్ రివ్యూ




నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటించిన చిత్రం "డెవిల్". కాగా ఈ చిత్రం ఈ రోజు విడుదలైంది. మరి ఈ సినిమా ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుందో చూద్దాం..

**కథ:** భారతదేశంలో బ్రిటిష్ పాలనా నేపథ్యంలో జరిగిన కథ ఇది. ఓ జమీందారు కుటుంబంలో జరిగిన హత్య ఎవరు చేశారో విచారణ చేయడానికి డెవిల్ (నందమూరి కళ్యాణ్ రామ్ ) వస్తాడు. అసలు సీక్రెట్ ఏజెంట్ అయిన డెవిల్, ఆ దివాణంలో జరిగిన హత్య విచారణ కోసం ఎందుకు రావాల్సి వచ్చింది ?, ఆ హత్య జరిగిన బంగ్లాలో ఉంటున్న నైషధ (సంయుక్త మీనన్) ఎవరు ?, ఆమెను డెవిల్ ఎందుకు టార్గెట్ చేశాడు ?, ఇంతకీ.. నైషధ కి నేతాజీకి ఉన్న సంబంధం ఏమిటి ?, అదే విధంగా ఆ హత్య ఎందుకు జరిగింది ?, ఈ మొత్తం వ్యవహారంలో మాళవిక నాయర్ పాత్ర ఏమిటి ?, చివరికి డెవిల్ (కళ్యాణ్ రామ్) లోని అసలు పాత్ర ఏమిటి ? అనేది మిగిలిన కథ.

**ప్లస్ పాయింట్స్:** కళ్యాణ్ రామ్ తన గత చిత్రాల కంటే భిన్నంగా బ్రిటిష్ నేపథ్యంలో ఈసారి మైండ్ గేమ్ యాక్షన్ డ్రామాతో సీక్రెట్ ఏజెంట్ గా వచ్చాడు. అలాగే, ఈ సినిమాలో తన లుక్స్ లో అండ్ యాక్షన్ లో ఫ్రెష్ నెస్ చూపించడానికి కళ్యాణ్ రామ్ చేసిన ప్రయత్నం బాగుంది. ముఖ్యంగా సీక్రెట్ ఏజెంట్ గా కళ్యాణ్ రామ్ నటన సినిమాకే హైలెట్ గా నిలుస్తోంది. మెయిన్ గా సెకండ్ హాఫ్ లో త్రివర్ణ పాత్రకు సంబంధించి రివీల్ అయ్యే ట్విస్ట్, అండ్ ప్రధాన యాక్షన్ సన్నివేశాలు చాలా బాగున్నాయి. సంయుక్త మీనన్ తో నడిచే ప్రేమ సన్నివేశాలు మరియు హీరో – హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ కూడా బాగానే ఆకట్టుకుంటుంది. ఇటు హీరోయిన్ సంయుక్త మీనన్ కూడా చాలా సెటిల్డ్ గా చక్కగా నటించింది. మరో కీలక పాత్రలో నటించిన మాళవిక నాయర్ కూడా తన నటనతో ఆకట్టుకుంది. సందర్భానుసారంగా ఆమె పలికించిన హావభావాలు బాగున్నాయి. ఈ చిత్రానికి మరో ప్రధానాకర్షణ నేతాజీ పాత్ర చుట్టూ స్క్రీన్ ప్లేను నడపడం. ఇక విలన్ గా నటించిన బ్రిటిష్ నటులు కూడా బాగానే నటించారు. కమెడియన్ సత్యతో పాటు శ్రీకాంత్ అయ్యంగార్, అజయ్ మరియు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్ర పరిధి మేరకు బాగానే నటించారు. రచయిత శ్రీకాంత్ విస్సా రాసుకున్న మెయిన్ పాయింట్ అండ్ ట్రీట్మెంట్ బాగున్నాయి. మొత్తమ్మీద ఈ చిత్రంలో యాక్షన్ సీన్స్ తో పాటు కొన్ని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కూడా బాగానే ఉన్నాయి.

**మైనస్ పాయింట్స్:** డెవిల్ లో మెయిన్ కంటెంట్ అండ్ పాయింట్ బాగున్నా.. స్క్రీన్ ప్లే విషయంలో కొన్ని చోట్ల స్లో అనిపించింది. ఫస్ట్ హాఫ్ కథనం విషయంలో రాజీ పడకుండా ఉండి ఉంటే బాగుండేది. ముఖ్యంగా సెకండాఫ్ లో సినిమా జరుగుతున్నంతసేపు తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠను ఇంకా పెంచగలిగే స్కోప్ ఉన్నపటికీ మేకర్స్ ఆ అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోలేదు. అలాగే సెకండ్ హాఫ్ ను కాస్త ఎమోషనల్ గా నడుపుదామని మంచి ప్రయత్నం చేశారు గాని, కొన్ని చోట్ల అది స్క్రీన్ మీద ఎఫెక్టివ్ గా వర్కౌట్ కాలేదు.

**సాంకేతిక విభాగం:** ఇక సాంకేతిక నిపుణుల గురించి మాట్లాడుకుంటే.. దర్శకుడు అభిషేక్ నామా తెరకెక్కించిన యాక్షన్ సీక్వెన్సెస్ బాగున్నాయి. సినిమాలో చాలా చోట్ల లాజిక్స్ మిస్ కాకుండా ఉండి ఉంటే.. సినిమా ఇంకా బాగుండేది. ఇక సంగీతం విషయానికి వస్తే.. పాటలు ఫర్వాలేదనిపిస్తే, నేపథ్య సంగీతం కొన్ని చోట్ల మాత్రమే బాగుంది. సినిమాటోగ్రఫర్ పనితనం ఈ సినిమాకి ప్రధాన బలం. ప్రతి ఫ్రేమ్ చాలా ఎఫెక్టివ్ గా తీశారు. సినిమాలోని నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి.

**తీర్పు:** 'డెవిల్' అంటూ వచ్చిన ఈ యాక్షన్ స్పై థ్రిల్లర్ లో.. యాక్షన్ సీక్వెన్సెస్ అండ్ కొన్ని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఆకట్టుకున్నాయి. తన యాక్టింగ్ అండ్ యాక్షన్ తో కళ్యాణ్ రామ్ మెప్పించాడు. ఐతే, రొటీన్ స్క్రీన్ ప్లే, కీలక సన్నివేశాలు స్లోగా సాగడం వంటి అంశాలు సినిమాకి మైనస్ అయ్యాయి. మొత్తమ్మీద ఈ చిత్రంలో మెయిన్ పాయింట్ తో పాటు యాక్షన్ ఎలిమెంట్స్ అండ్ ట్విస్ట్ లు బాగున్నాయి. ఓ వర్గం ప్రేక్షకులకు ఈ చిత్రం బాగా కనెక్ట్ అవుతుంది.



# బబుల్‌గమ్ రివ్యూ

2023 సినీ క్యాలెండర్ చివరి పేజీలోకి వచ్చింది. ఈ ఏడాదికి వీడ్కోలు పలికేందుకు ఆఖరి వారం కళ్యాణ్ రామ్ 'డెవిల్'తో పాటు మరో చిన్న చిత్రం బాక్సాఫీస్ ముందుకొచ్చింది. అదే 'బబుల్‌గమ్'. ఈ సినిమాతో రాజీవ్ కనకాల, సుమ దంపతుల తనయుడు రోషన్ కనకాల హీరోగా తెరకు పరిచయం అవుతున్నారు. క్షణం, కృష్ణ అండ్ హీజ్ లీలా చిత్రాలతో ఆకట్టుకున్న రవికాంత్ పేరేపు ఈ సినిమాకి దర్శకత్వం వహించారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వంటి పెద్ద నిర్మాణ సంస్థ ఇందులో భాగస్వామిగా ఉండటం.. చిరంజీవి, రాజమౌళి, వెంకటేష్ వంటి ప్రముఖ సినీతారలు ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం.. ఇక టీజర్, ట్రైలర్, పాటలు యువతరాన్ని ఆకర్షించేలా ఉండటంతో సినిమాపై కాస్త అంచనాలు పెరిగాయి. మరి ఆ అంచనాల్ని ఈ చిత్రం అందుకుందా? హీరోగా రోషన్ తొలి ప్రయత్నంలోనే విజయాన్ని అందుకున్నాడా?

కథేంటంటే: ఆది అలియాస్ ఆదిత్య (రోషన్ కనకాల) హైదరాబాద్‌కు చెందిన ఓ మధ్యతరగతి కుర్రాడు. డీజే అవ్వాలన్న లక్ష్యంతో జీవిస్తుంటాడు. ఓ పార్టీలో జాను అలియాస్ జాన్వీ (మానస చౌదరి)ని చూసి మనసు పారేసుకుంటాడు. ఆమె చాలా పెద్దింటి అమ్మాయి. ఆధునిక జీవన శైలికి అలవాటు పడిన ఆమెకు ప్రేమ, పెళ్లి వంటి ఎమోషన్స్‌పై అంతగా నమ్మకం ఉండదు. అబ్బాయిల్ని ఓ టాయ్‌లా చూసే తను.. మొదట్లో ఆది డీజే ప్లే చేసే తీరు నచ్చి ఇష్టపడుతుంది. ఆ తర్వాత అతని వ్యక్తిత్వం నచ్చి మరింత సన్నిహితంగా మెలుగుతుంది. ఈ క్రమంలో తెలియకుండానే ఆదితో ప్రేమలో పడిపోతుంది. అయితే ఓ పార్టీలో జాను ఫ్రెండ్ చేసిన ఓ తొందర పాటు పని వాళ్లిద్దరి మధ్య చిచ్చు రేపుతుంది. అంతేకాదు ఆ వేడుకలో అందరి ముందు ఆదిని దారుణంగా అవమానిస్తుంది జాను. మరి ఆ తర్వాత ఏమైంది? జాను చేసిన ఆ అవమానాన్ని ఆది ఎలా తీసుకున్నాడు? రెండు భిన్న నేపథ్యాలు కలిగిన వీరి ప్రేమ ఆఖరికి ఏ కంచికి చేరింది? డీజే అవ్వాలన్న తన లక్ష్యాన్ని ఆది చేరుకున్నాడా? లేదా? అన్నది మిగతా కథ.

ఎలా సాగిందంటే: ఇది పూర్తిగా యువతరం లక్ష్యంగా రూపొందించిన చిత్రం. దీంట్లోని కథా నేపథ్యం కూడా కొత్తదేమీ కాదు. విరామ సన్నివేశాలు, క్లైమాక్స్ మినహా మిగతా కథనమంతా చాలా రొటీన్‌గా ఉంటుంది. నాయకానాయికల ప్రేమకథలో కానీ, వాళ్లిద్దరి మధ్య అనుబంధాన్ని ఆవిష్కరించిన తీరులో గానీ ఏమాత్రం కొత్తదనం కనిపించదు. హీరో డీజే నేపథ్యం.. అతని కుటుంబ వాతావరణం.. వంటివి చూస్తే ఆరంభంలో దీంట్లో డీజే టిల్లు ఛాయలు కనిపిస్తాయి. ఓ చిన్న ఇంట్రడక్షన్ ఫైట్‌తో హీరో పరిచయం అయిన తీరు ఫర్వాలేదనిపిస్తుంది. ఆ తర్వాత అతని కుటుంబ నేపథ్యాన్ని.. ఫ్రెండ్స్ గ్యాంగ్‌ను పరిచయం చేస్తూ నెమ్మదిగా సినిమాని ముందుకు తీసుకెళ్లారు దర్శకుడు. జాను - ఆదిల పరిచయం.. వాళ్లిద్దరూ దగ్గరవడం.. ఒకరిపై ఒకరు ఇష్టాన్ని పెంచుకోవడం.. ఈ ట్రాక్‌లో పెద్దగా ఎమోషన్స్ కనిపించవు. దీంతో వారి లవ్ ట్రాక్‌తో ప్రేక్షకులూ ఎమోషనల్‌గా కనెక్ట్ కాలేరు. పైగా వీళ్లిద్దరి మధ్య వచ్చే రొమాంటిక్ సన్నివేశాల్ని చూస్తే వీరి అనుబంధంలో ప్రేమ కంటే ఎక్కువగా మోహం కనిపిస్తుంది. కేవలం యువతరాన్ని ఆకర్షించడానికే ఈ ట్రాక్ ఉపయోగపడొచ్చేమో కానీ, మిగతా ప్రేక్షకులకు ఇది సహనానికి పరీక్ష. విరామ సన్నివేశాలు మాత్రం చాలా కొత్తగా ద్వితీయార్ధంపై ఆసక్తిరేకెత్తించేలా చేస్తాయి.

ప్రేమికురాలి చేతిలో దారుణ అవమానం తర్వాత కసితో ఆది తన లక్ష్యం దిశగా అడుగులేసే తీరు మెప్పిస్తుంది. ఈ క్రమంలో వచ్చే ఇజ్జత్ గీతం ఆకట్టుకుంటుంది. జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు తలవొంచద్దంటూ.. డబ్బు సంపాదించడంలో కిక్ ఉందంటూ ఆదికి తన తండ్రి అందించే స్ఫూర్తి మనసులకు హత్తుకుంటుంది. నిజానికి ద్వితీయార్ధంలో తండ్రీకొడుకుల అనుబంధాల నేపథ్యంలో వచ్చే ప్రతి సీన్ ప్రేక్షకుల్ని అలరిస్తుంది. ఇక ప్రథమార్ధంలో గ్లామర్ డాల్‌గా కనిపించిన కథానాయిక పాత్ర ద్వితీయార్ధంలో నటనా ప్రాధాన్యమున్న పాత్రలా మారిపోతుంది. తన తప్పు తెలుసుకొని ఆది ప్రేమ కోసం జాను ఆరాటపడటం.. ఈ క్రమంలో ఆది ఇంటికెళ్లి అతను మనసు గెలుచుకునేందుకు చేసే ప్రయత్నాలు జస్ట్ ఓకే. ఒకానొక దశలో ద్వితీయార్ధంలో కథను మొత్తం జానునే ముందుకు నడిపిస్తుంది. పతాక సన్నివేశాల్ని దర్శకుడు కొత్తగా మలుచుకున్నాడు. ముగింపు యువతకు ఓ చిన్న సందేశమిచ్చేలా ఉంటుంది. అయితే దాన్ని వాళ్లు ఎలా స్వీకరిస్తారన్న దాన్ని బట్టి ఫలితం ఆధారపడి ఉంటుంది.

ఎవరెలా చేశారంటే: పక్కా హైదరాబాదీ కుర్రాడిగా ఆది పాత్రలో రోషన్ చక్కగా ఒదిగిపోయాడు. అతని లుక్స్, యాక్టింగ్, డైలాగ్ డెలివరీ అన్నీ బాగున్నాయి. భావోద్వేగభరిత సన్నివేశాల్లోనూ చక్కటి నటన కనబరిచాడు. జాన్వీగా మానస చౌదరి ఇటు అందంతోనూ అటు అభినయంతోనూ ఆకట్టుకుంది. కొన్ని రొమాంటిక్ సన్నివేశాలతో ప్రేక్షకుల్ని హీటెక్కించే ప్రయత్నం చేసింది. హీరో తండ్రిగా చైతూ జొన్నలగడ్డ పాత్ర అందర్నీ ఆకట్టుకుంటుంది. ద్వితీయార్ధానికి ఈ పాత్ర ప్రధాన ఆకర్షణ. బుబుల్‌గమ్ పేరుకు తగ్గట్లుగా ప్రథమార్ధమంతా సాగతీత వ్యవహారంలా ఉంటుంది. ద్వితీయార్ధం మాత్రం కాసిన్ని నవ్వులతో.. ఇంకొంచెం భావోద్వేగాలతో కట్టిపడేస్తుంది. యువతరాన్ని ఆకర్షించాలనే ప్రయత్నంలో కథలో బూతులు ఎక్కువ వాడేశారనిపిస్తుంది. అలాగే దర్శకుడు తను చెప్పాలనుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పలేకపోయారనిపిస్తుంది. అయితే కొత్త నటీనటుల నుంచి మంచి నటన రాబట్టుకోవడంలో పైచేయి సాధించాడు. శ్రీచరణ్ పాటలు పెద్దగా గుర్తుంచుకునేలా లేకున్నా.. నేపథ్య సంగీతం ఆకట్టుకుంటుంది. సురేష్ ఛాయాగ్రహణం బాగుంది. నిర్మాణ విలువలు కథకు తగ్గట్లుగా ఉన్నాయి.



## కొత్త సంవత్సరానికి మోదీ ధమాకా ఆఫర్
# తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు

మోదీ సర్కారు త్వరలో గుడ్ న్యూస్ చెప్పనుంది. పెట్రోల్, డీజిల్ రేట్లను భారీగా తగ్గించడానికి ప్రయత్నాలు చేస్తోంది. లీటర్ డీజిల్ మీద ఎనిమిది రూపాయలు, పెట్రోల్ మీద పది రూపాయల వరకు తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్త సంవత్సరానికి మోదీ ధమాకా కానుక ఇవ్వడం ఖాయమని తెలుస్తోంది. రేపో, ఎల్లుండో ఈ ప్రకటన నేరుగా ప్రధాని మోదీనే చేయవచ్చని సమాచారం. పెట్రోలియమ్ శాఖ ఇప్పటికే ఈ ధరల తగ్గింపు కసరత్తును పూర్తిచేసింది. అంటే ఇప్పటికే సెంచరీ దాటిన పెట్రోల్ ధరలు కాస్త దిగి వచ్చే చాన్స్ ఉందన్నమాట. వచ్చే ఏడాది మార్చిలో లోక్ సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రంలోని మోదీ సర్కార్.. ఇంధన ధరలు తగ్గించే అవకాశం ఉందని కొన్ని రోజులుగా వార్తలు ప్రచారంలో ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ రేట్లతో పాటుగా గ్యాస్ సిలిండర్ ధరలను కూడా భారీ స్థాయిలో తగ్గించే ఆలోచనలో కేంద్రం ఉన్నట్లుగా జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇక ప్రస్తుతం ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర 96.72 ఉండగా, లీటర్ డీజిల్ ధర 89.62 ఉంది. ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రధాన నగరాల్లో రూ. 100 కంటే ఎక్కువగా ఉన్నాయి. చివరిసారిగా కేంద్ర ప్రభుత్వం 2022 మే 22న పెట్రోల్, డీజిల్ ధరలపై సెంట్రల్ ఎక్సైజ్ డ్యూటీ ఎత్తివేసింది. పెట్రోల్‌పై రూ. 8, డీజిల్‌పై రూ. 6 చొప్పున పన్ను తగ్గించింది.

# 50 శాటిలైట్లను ప్రయోగిస్తాం: ఇస్రో చైర్మన్



వచ్చే ఐదేళ్లలో 50 ఉపగ్రహాలను ప్రయోగించాలని ఇండియా లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. శక్తిమంతమైన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దే లక్ష్యానికి ప్రస్తుతం ఉన్న జియో ఇంటెలిజెన్స్ కూడా సరిపోదని ఆయన చెప్పారు. ఇప్పుడు ఉన్నదానికంటే పది రెట్లు అధిక సామర్థ్యంతో పనిచేసే జియో ఇంటెలిజెన్స్ కావాలని ఎస్.సోమనాథ్ తెలిపారు. అలాగే జియో ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన శాటిలైట్లపై కూడా దృష్టి సారించిందన్నారు.

# మళ్ళీ డేంజర్ బెల్స్ మోగిస్తున్న కరోనా..

## 24 గంటల్లో 702 కొత్త కేసులు నమోదు..



దేశంలో మళ్లీ కరోనా వైరస్ చాప కింద నీరు లాగా వ్యాప్తి చెందుతోంది. రోజు రోజుకూ కొత్త కేసుల సంఖ్య, మరణాల సంఖ్య పెరుగుతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇటు JN-1 వేరియంట్ కేసులు కూడా వేగంగా విస్తరిస్తున్నాయి. మరోసారి కరోనా వైరస్ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఓవైపు కరోనా కేసులు పెరుగుతుండగా.. మరోవైపు JN-1 వేరియంట్ కేసులు కూడా భారీగా నమోదవుతున్నాయి. కొత్త వేరియంట్ JN 1 కారణంగానే దేశంలో కరోనా కేసుల్లో భారీగా పెరుగుదల కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. కొన్ని వారాలుగా అనేక రాష్ట్రాల్లో కొవిడ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. 24 గంటల్లో 702 కొత్త కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 4,097కు చేరింది. కొత్తగా ఆరు మరణాలు సంభవించాయని అధికారులు ప్రకటించారు. కరోనాతో మహారాష్ట్రలో ఇద్దరు, కర్ణాటక, కేరళ, పశ్చిమ బెంగాల్, ఢిల్లీల్లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. దేశంలో జేఎన్-1 వేరియంట్ కేసులు భారీగా పెరిగాయి. ఇప్పటివరకు 157 కేసులు నమోదయ్యాయి. కేరళలో 78, గుజరాత్‌లో 34, గోవాలో 18 కేసులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఇక దేశ రాజధాని ఢిల్లీలో తొలి జేఎన్ 1 కరోనా వేరియంట్ కేసు నమోదైంది. JN-1 సబ్‌వేరియంట్ కేసులు నవంబర్‌లో 16 గుర్తించగా.. డిసెంబర్‌లోనే 141 నమోదయ్యాయి. ఇక కొత్త వేరియంట్ కేసు నమోదు కావడంతో ఢిల్లీ సర్కార్ అప్రమత్తమైంది. అన్ని కొవిడ్ పాజిటివ్ కేసులకు జీనోమ్ సీక్వెన్సింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించింది. తద్వారా కొత్త వేరియంట్లను నిర్ధారించవచ్చని భావిస్తోంది.

# ట్రంప్‌పై మరో రాష్ట్రం వేటు..
# ప్రైమరీలో పోటీ చేయకుండా నిషేధం



రెండోసారి అమెరికా అధినేతగా ఎన్నికయ్యేందుకు బరిలోకి దిగిన రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్ నకు వరుస ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. దేశాధ్యక్షుడి పదవికి ఆయన అనర్హుడని ఇటీవల కొలరాడో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. తాజాగా మరో రాష్ట్రం ఆయనపై వేటు వేసింది. ఈ సారి 'మైన్' ప్రైమరీ బ్యాలెట్ పోరు నుంచి ట్రంప్ పేరును తొలగిస్తున్నట్లు ఆ రాష్ట్ర సెక్రటరీ (ప్రధాన ఎన్నికల అధికారి) తాజాగా వెల్లడించారు. కొలరాడో తీర్పుపై రిపబ్లికన్ పార్టీ అమెరికా సుప్రీంకోర్టును ఆశ్రయించిన వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. కొలరాడో సుప్రీంకోర్టు తీర్పు తర్వాత.. మైన్ రాష్ట్రంలో ట్రంప్ అభ్యర్థిత్వాన్ని కొందరు సవాల్ చేశారు. వారి అప్పీళ్లను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర సెక్రటరీ షెన్నా బెల్లోస్.. ట్రంప్ పేరును ప్రైమరీ బ్యాలెట్ నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఈ ఉత్తర్వులపై ట్రంప్ కోర్టుకెళ్లేందుకు అవకాశం కల్పించారు. అప్పటిదాకా ఆదేశాల అమలును నిలిపివేస్తున్నట్లు తెలిపారు. దీంతో బెల్లోస్ నిర్ణయాన్ని రిపబ్లికన్ పార్టీ.. మైన్ రాష్ట్ర కోర్టుల్లో సవాల్ చేయనుంది. కాగా.. అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న అభ్యర్థి పేరును ఓ ఎన్నికల అధికారి ఇలా బ్యాలెట్ నుంచి తొలగించడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

# సల్మాన్‌కి జోడీగా త్రిష?



బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్ ఇటీవల యష్ రాజ్ ఫిలిమ్స్ బ్యానర్ పై మనీష్ శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన టైగర్ 3 మూవీ ద్వారా ఆడియన్స్ ముందుకి వచ్చారు. కత్రినా కైఫ్ హీరోయిన్ గా నటించిన ఈమూవీ బాక్సాఫిస్ వద్ద పెద్ద సక్సెస్ కాలేదు. విషయం ఏమిటంటే, తన తదుపరి సినిమాని విష్ణువర్ధన్ దర్శకత్వంలో చేయడానికి సిద్ధం అయ్యారు సల్మాన్. గతంలో బిల్లా, పంజా, షేర్షా వంటి మూవీస్ ని ఆయన తెరకెక్కించారు. కాగా సల్మాన్ ఖాన్ మూవీకి ది బుల్ అనే టైటిల్ ఖరారు చేసారు. 1988 మాల్దీవ్స్ లో జరిగిన ఆపరేషన్ కాక్టస్ అంశాన్ని తీసుకుని ఈ మూవీని తెరకెక్కించనున్నారు. అయితే విషయం ఏమిటంటే, ఈమూవీలో సల్మాన్ కి జోడీగా అందాల నటి త్రిష ని హీరోయిన్ గా తీసుకోనున్నట్లు లేటెస్ట్ టాలీవుడ్ వర్గాల బజ్.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## కాల్పులు ఆపమని ఆదేశించినా.. బందీలను షూట్ చేసిన సైనికులు..!

తమ దేశానికే చెందిన ముగ్గురు బందీలను శత్రువులుగా పొరబడి ఇజ్రాయెల్ సైన్యం గాజాలో కాల్చి చంపడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఉత్తర గాజాలోని షిజాయా ప్రాంతంలో డిసెంబర్ 15న ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించి ఇజ్రాయెల్ సైన్యం జరిపిన దర్యాప్తులో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఆ ప్రాంతంలో బందీలు ఉన్నట్లు నిఘా సమాచారం ఉన్నప్పటికీ.. బలగాలకు తగిన అవగాహన లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని తేలింది. "గాజాలో ఇజ్రాయెల్-హమాస్ మధ్య భీకరదాడులు జరుగుతోన్న సమయంలో బిస్లమక్ బ్రిగేడ్ 17వ బెటాలియన్‌కు చెందిన సైనికుడు ముగ్గురు వ్యక్తులపై కాల్పులు జరిపాడు. వారిని హమాస్ సభ్యులుగా భ్రమించి అతడు దాడికి దిగాడు. ఆ కాల్పుల్లో ఇద్దరు మరణించగా.. మూడో వ్యక్తి సమీప భవనంలోకి పారిపోయాడు. వెంటనే కాల్పులు ఆపాలని అక్కడే ఉన్న కమాండర్ సైనికులను ఆదేశించాడు. అలాగే ఆ వ్యక్తి ఎవరనేది గుర్తించాలని చెప్పాడు. ఆ తర్వాత కొద్దిసేపటికి ఆ భవనం నుంచి 'సహాయం చేయండి. వారు నన్ను షూట్ చేస్తున్నారు' అని హిబ్రూ భాషలో అరుపులు వినిపించాయి. దాంతో కాల్పులు నిలిపేయాలని కమాండర్ మరోసారి ఆదేశాలు జారీ చేశాడు. ఆ తర్వాత మూడో వ్యక్తి భవనం నుంచి బయటకు వచ్చాడు. సైన్యం దిశగా వచ్చే ప్రయత్నం చేశాడు. పక్కన ట్యాంక్ నుంచి చప్పుడు వస్తుండటంతో కమాండర్ ఆదేశాలు సైనికులకు వినిపించలేదు. దాంతో అక్కడున్న ఇద్దరు సైనికులు సదరు మూడో బందీపై కాల్పులు జరిపారు" అని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ జరిపిన తుది దర్యాప్తులో వెల్లడైంది..



## ఖైదీలకూ సంతానోత్పత్తి హక్కు

తమ వంశాన్ని నిలబెట్టుకునే హక్కు ఖైదీలకూ ఉంటుందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. హత్య కేసులో జీవిత ఖైదు శిక్షను అనుభవిస్తున్న వ్యక్తికి నాలుగు వారాల పాటు పెరోల్ మంజూరు చేసింది. తన భర్త ద్వారా సంతానాన్ని పొందే అవకాశం కల్పించాలన్న అతని భార్య అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటూ కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరించింది. భార్య వయసు 38 ఏళ్లు, భర్త వయసు 41 ఏళ్లను ప్రస్తావిస్తూ....శిక్షా కాలం పూర్తయ్యాక ఆ దంపతులకు సంతానాన్ని పొందే వయసు మీరిపోతుందని, వయోభారం వారి ఉమ్మడి ఆకాంక్షకు అవరోధంగా మారుతుందని జస్టిస్ స్వర్ణ కాంత శర్మ అభిప్రాయపడ్డారు. తన భర్త ద్వారా సంతానాన్ని పొందాలన్న భార్య హక్కును ప్రభుత్వం అడ్డుకోలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత కేసులోని పూర్వాపరాలను పరిశీలించిన తర్వాత ఖైదీకి తన వంశాన్ని నిలుపుకొనే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తీర్పులో వివరించారు. దాంపత్య జీవనం కోసం అనుమతివ్వడం లేదని, వంశాన్ని నిలబెట్టుకోవాలన్న భార్య ఆకాంక్షను, హక్కును గౌరవిస్తున్నట్లు తెలిపారు. ఖైదీ ఇప్పటికే 14 ఏళ్లుగా జైలులో ఉన్న విషయాన్నీ న్యాయమూర్తి ప్రస్తావించారు. పెరోల్ కోసం రూ.20 వేలకు వ్యక్తిగత బాండును సమర్పించడంతో పాటు ఒకరి పూచీకత్తు ఇవ్వాలని షరతు విధించారు.



## పాత సామాన్లు అమ్మి రూ.1200కోట్లు సంపాదించిన మోడీ సర్కార్

చంద్రునిపైకి భారతదేశం విజయవంతంగా చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ ఖర్చు దాదాపు రూ.600 కోట్లు. జంక్, చిరిగిపోయిన కార్యాలయ సామగ్రి, పాత వాహనాలు, పాత ఫైళ్లను విక్రయించడం ద్వారా నరేంద్ర మోడీ ప్రభుత్వం చంద్రయాన్ లాంటి రెండు మిషన్ల ఖర్చుతో సమానమైన డబ్బును సేకరించింది. అక్టోబర్ 2021 నుండి స్క్రాప్‌లను విక్రయించడం ద్వారా దాదాపు రూ.1,163 కోట్లు ఆర్జించబడ్డాయి. ఈ ఏడాది అక్టోబర్‌లోనే ప్రభుత్వానికి రూ.557 కోట్ల ఆదాయం వచ్చింది. అక్టోబర్ 2021 నుండి కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో 96 లక్షల ఫైళ్లు తొలగించబడినట్లు నివేదిక పేర్కొంది. ఈ ఫైల్‌లు కంప్యూటర్‌కు అప్‌లోడ్ చేయబడ్డాయి. దీని వల్ల మరో ప్రయోజనం కూడా ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపు 355 లక్షల చదరపు అడుగుల స్థలం ఖాళీ అయింది.

## అప్పులబాధ తాళలేక ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఆత్మహత్య..

అనకాపల్లిలో విషాదం చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆత్మహత్యకు యత్నించిన మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. అప్పుల బాధ తాళలేక వీరంతా బలవన్మరణానికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన స్వర్ణకారుడు శివరామకృష్ణ కుటుంబం కొంతకాలంగా అనకాపల్లిలో నివసిస్తోంది. గురువారం రాత్రి వీరంతా సైనైడ్ తాగినట్లు తెలుస్తోంది. వీరిలో శివరామకృష్ణ(40), మాధవి(38), కుమార్తెలు వైష్ణవి(16), లక్ష్మి(13) మృతి చెందారు. అనకాపల్లి ప్రభుత్వాస్పత్రిలో మరో కుమార్తె కుసుమప్రియ(13) చికిత్స పొందుతోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# త్వరలోనే జాతీయ ఈ-కామర్స్ పాలసీ..




జాతీయ ఈ-కామర్స్ పాలసీ తుది దశకు చేరుకుందని.. దీన్ని త్వరలో విడుదల చేయబోతున్నామని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పీయూష్ గోయల్ తెలిపారు. ఆగస్టులో ఈ పాలసీకి సంబంధించి డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ ఈ-కామర్స్ సంస్థల ప్రతినిధులు, దేశీయ వ్యాపారుల సంఘంతో చర్చలు జరిపింది. అయితే, ఈ అంశం ప్రస్తుతం ప్రభుత్వంలోని అత్యున్నత స్థాయిలో చివరి దశకు చేరుకుంది. దీన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన చెప్పకొచ్చారు. జాతీయ రిటైల్ వాణిజ్య విధానంపై కూడా డీపీఐఐటీ పని చేయనుందని పీయూష్ గోయల్ వెల్లడించారు. అయితే, మంత్రిత్వ శాఖ రెండు జాతీయ ఈ- కామర్స్ విధానాల ముసాయిదాను విడుదల చేసింది అని కేంద్ర పరిశ్రమల మంత్రిత్వశాఖ పీయూష్ గోయల్ తెలిపారు. 2019 డ్రాఫ్ట్ ఈ- కామర్స్ పర్యావరణ వ్యవస్థ యొక్క ఆరు విస్తృత రంగాలను కవర్ చేసింది. డేటా, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఈ-కామర్స్ మార్కెట్ ప్లేస్, రెగ్యులేటరీ సమస్యలు, దేశీయ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ యొక్క ప్రమోషన్ లాంటి సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయి. ఎగుమతులతో పాటు ఈ-కామర్స్ ద్వారా ఎగుమతి ప్రమోషన్ వంటివి జాతీయ రిటైల్ ట్రేడ్ పాలసీపై కూడా డీపీఐఐటీ పని చేస్తోందని పీయూష్ గోయల్ చెప్పారు.




## స్లో ఓవర్ రేటుతో టీమిండియా జరిమానా..
### కీలక పాయింట్లు కోల్పోయిన రోహిత్ సేన

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఇన్నింగ్స్ 32 రన్స్ తేడాతో ఓడిన విషయం తెలిసిందే. అయితే ఆ మ్యాచ్‌లో మరీ నెమ్మదిగా బౌలింగ్ చేసిన రోహిత్ సేనకు జరిమానా విధించింది ఐసీసీ. అంతేకాదు, ఐసీసీ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లో కీలకమైన రెండు పాయింట్లను కూడా టీమిండియా కోల్పోయింది. సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో భారత జట్టు రెండు ఓవర్లు తక్కువగా బౌల్ చేసింది. స్లో ఓవర్ రేటు కారణంగా టీమిండియాకు మ్యాచ్ ఫీజులో 10 శాతం ఫైన్ విధించారు. టార్గెట్ లోపు భారత్ రెండు ఓవర్లు తక్కువగా బౌల్ చేసిందని, అందుకే జరిమానా విధించామని ఐసీసీ ఎలైట్ ప్యానెల్ రెఫరీ క్రిస్ బోర్డు తెలిపారు. నిర్ణీత సమయంలోగా ఓవర్ల కోటాను పూర్తి చేయకుంటే, ఆర్టికల్ 2.22 ఐసీసీ ప్రవర్తనా నియమావళి కింద ఆటగాళ్లపై 5 శాతం ఫీజు కోత విధిస్తారు.తొలి టెస్టులో ఓడిన ఇండియా ఐసీసీ పాయింట్ల పట్టికలో కీలక పాయింట్లను కోల్పోయింది. 16 పాయింట్లతో ఇండియా అయిదో స్థానంలో నిలిచింది. పాయింట్ల శాతం 44.44 గా ఉంది. ఇక స్లో ఓవర్ రేట్ వల్ల పాయింట్లను తగ్గించడంతో.. స్టాండింగ్స్‌లో ఇండియా పొజిషన్ మారింది.

## కిల్లింగ్ లుక్స్‌తో ప్రాణాలు తీస్తున్న సయీ మంజ్రేకర్

'స్కంద' సినిమాలో సెకండ్ హీరోయిన్ గా నటించింది సయీ మంజ్రేకర్. దబాంగ్3' తో సిల్వర్ స్క్రీన్ పరిచయమైన సయీ మంజ్రేకర్.. ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస మూవీస్ తో బిజీగా ఉంది.మహారాష్ట్రలోని ముంబయిలో 1998 ఆగస్టు 29న జన్మించింది. బాలీవుడ్ నటుడు మహేష్ మంజ్రేకర్ కూమార్తె ఈమె.'కక్స్‌పర్ష్' అనే మరాఠీ చిత్రం (2012)లో కీలకపాత్రలో నటించింది. సల్మాన్ ఖాన్ హీరోగా నటించిన 'దబాంగ్ 3' చిత్రంతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది.'మేజర్'లో హీరోయిన్ గా నటించింది సయీ మంజ్రేకర్.





## నష్టాలతో ఆరంభమైన 2023 చివరి ట్రేడింగ్ సెషన్

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు 2023 చివరి ట్రేడింగ్ సెషన్‌ను నష్టాలతో ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని మిశ్రమ సంకేతాలు సూచీలపై ప్రభావం చూపుతున్నాయి. ఉదయం 9:26 గంటల సమయంలో సెన్సెక్స్ 178 పాయింట్లు నష్టపోయి 72,231 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 57 పాయింట్లు కుంగి 21,721 దగ్గర కొనసాగుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.15 వద్ద ప్రారంభమైంది. సెన్సెక్స్-30 సూచీలో టాటా మోటార్స్, నెస్లే ఇండియా, మారుతీ, ఐటీసీ, ఎల్అండ్‌టీ, ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా లాభాల్లో కొనసాగుతున్నాయి. కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్, టైటన్, ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, ఎస్‌బీఐ, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్ఎం, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అమెరికా మార్కెట్లు గురువారం ఫ్లాట్‌గా ముగిశాయి. ఐరోపా సూచీలు నష్టాల్లో స్థిరపడ్డాయి. ఆసియా-పసిఫిక్ ప్రధాన సూచీలు నేడు లాభాలతో ప్రారంభమయ్యాయి. తీవ్ర ఒత్తిళ్లు ఎదురయ్యే పరిస్థితుల్లోనూ బ్యాంకులు కనీస మూలధన అవసరాలను కలిగి ఉండే సామర్థ్యాన్ని కనబరుస్తున్నాయని ఆర్‌బీఐ గురువారం విడుదల చేసిన ఆర్థిక స్థిరత్వ నివేదిక తెలిపింది. ఎన్‌బీఎఫ్‌సీ రంగంలో 2023 మార్చితో పోలిస్తే కొన్ని బలహీనతలు కనిపిస్తున్నాయని పేర్కొంది. 2023-24 ప్రథమార్థంలో బ్యాంకుల ఆస్తుల నాణ్యత, మూలధన పరిస్థితులు, లాభదాయకత పుంజుకుందని తెలిపింది. మరోవైపు విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం రూ.4,359 కోట్ల విలువ చేసే భారత ఈక్విటీలను కొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపర్లు సైతం రూ.137 కోట్ల విలువ చేసే షేర్లను కొన్నారు.

## రేపు పట్టాలెక్కనున్న అమృత్ భారత్ రైలు

రైల్వేశాఖ ప్రవేశపెట్టనున్న అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు శనివారం నుంచి పట్టాలెక్కనున్నాయి. అందులో భాగంగా పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా - బెంగళూరుల మధ్య నడిచే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధాని మోడీ లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఏపీలోని తుని, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంటల మీదుగా ప్రయాణిస్తుంది. 12 స్లీపర్, 8 జనరల్, 2 గార్డు బోగీలు ఉంటాయి.




## "గుంటూరు కారం" నుండి కుర్చీ మడతపెట్టి ప్రోమో రిలీజ్!

సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రధాన పాత్రలో, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్టైనర్ గుంటూరు కారం. జనవరి 12, 2024 న సంక్రాంతి పండుగ సందర్భంగా రిలీజ్ కానున్న ఈ సినిమా పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ సినిమా నుండి రిలీజైన ప్రచార చిత్రాలకి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా ఈ చిత్రం నుండి కుర్చీ మడతపెట్టి సాంగ్ ప్రోమో ను రిలీజ్ చేశారు మేకర్స్. మాస్ నంబర్ గా ఈ ప్రోమో సాంగ్ ఉంది. ఇందుకు సంబంధించిన పూర్తి పాట రేపు రిలీజ్ కానుంది. ఈ పాటకి రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ రాయగా, థమన్ సాంగ్ ను కంపోజ్ చేయడం జరిగింది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్న ఈ చిత్రం లో శ్రీ లీల, మీనాక్షి చౌదరి లు లేడీ లీడ్ రోల్స్ లో నటిస్తున్నారు. ఈ చిత్రం కోసం ఆడియెన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు.

## 'కౌన్ బనేగా కరోడ్‌పతి'లో రేవంత్ రెడ్డిపై ప్రశ్న



'కౌన్ బనేగా కరోప్‌పతి-15' ప్రోగ్రాంలో డిసెంబర్ 15న రేవంత్ రెడ్డిపై ప్రశ్న వచ్చింది. 'రేవంత్ రెడ్డి ఏ రాష్ట్రానికి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు?' అని అమితాబ్ కంటెస్టెంట్‌కి ప్రశ్న వేశారు. ఏ.ఛత్తీస్‌గఢ్, బీ. తెలంగాణ, సీ.మధ్యప్రదేశ్, డీ.ఆంధ్రప్రదేశ్ అనే ఆప్షన్లు ఇవ్వగా.. యువతి ఆన్సర్ చెప్పలేకపోయింది. లైఫ్ లైన్ తీసుకోగా.. ఆడియన్స్‌లో చాలా మంది తెలంగాణ అనే సమాధానాన్ని సూచించారు.